# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 87 ప్రకాశం, శుక్రవారం 26- 12 - 2025 పేజిలు : 4 వెల. 2 /-







## ఘనంగా కీశే పోతుల చెంచయ్య వేడుకలు



**ఒంగోలు క్రై%శీ% కౌంటర్ ప్రతినిధి**,టంగుటూరులో కీ.శే మాజీ జడ్పీ చైర్మన్ పోతుల చెంచయ్య 29వర్ధంతి కార్యక్రమ%శీ% గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి,మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య , కందుకూరు ఎక్స్ ఎమ్మెల్యే పోతుల రామారావు ,రంగ సాయి , తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాజ్ పేయి జయంతి వేడుకలు



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి.నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,**అటల్ బీహార్ వాజ్ పేయి జయంతి సందర్భంగా మండలంలోని మాచవరంలో బిజెపి, టిడిపి, జనసేన నాయకులు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమములో కుటమి ప్రభుత్వ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## భీమవరం డీఎస్పీ జయసూర్య బదిలీ..

### పవన్ కళ్యాణ్ ఫిర్యాదుతోనే వేటు?

### రఘువీర్ విష్ణుకు బాధ్యతలు



**క్రైం కౌంటర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీగా పనిచేస్తున్న జయసూర్యను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కొత్త డీఎస్పీగా రఘువీర్ విష్ణును నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత కొంతకాలంగా భీమవరం పోలీస్ విభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ఈ బదిలీ ప్రాధాన్యత సంతరించుకుంది. తక్షణమే విధుల్లో చేరాలని కొత్తగా నియమితులైన రఘువీర్ విష్ణును ఉన్నతాధికారులు ఆదేశించారు.డీఎస్పీ జయసూర్యపై వచ్చిన తీవ్రమైన అవినీతి ఆరోపణలే ఈ బదిలీకి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆయన తన పరిధిలోని ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలకు, ముఖ్యంగా పేకాట శిబిరాల నిర్వహణకు సహకరిస్తున్నారని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆయనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ అక్టోబరు నెలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా డీజీపీకి లేఖ రాశారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అయితే, జయసూర్య బదిలీ వ్యవహారం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. జయసూర్యపై ఒకవైపు తీవ్ర ఆరోపణలు వస్తున్నప్పటికీ, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మాత్రం ఆయనకు మద్దతుగా నిలిచారు. జయసూర్య సమర్థవంతమైన అధికారి అని, ఆయన పనితీరు బాగుందని గతంలోనే రఘురామ కితాబిచ్చారు. కూటమి ప్రభుత్వంలోని ఇద్దరు కీలక నేతలు ఒకే అధికారి విషయంలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడం అప్పట్లో రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. చివరకు ప్రభుత్వం మరియు పోలీస్ ఉన్నతాధికారులు విచారణ నివేదికలు, ఫిర్యాదుల ఆధారంగానే బదిలీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాలనలో పారదర్శకత పెంచడానికి మరియు పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించడానికి ఈ మార్పులు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త డీఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న రఘువీర్ విష్ణు భీమవరంలో అక్రమ కార్యకలాపాలను ఏ మేరకు అరికడతారో చూడాలి. బదిలీ అయిన జయసూర్యకు ప్రస్తుతం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

## అంకమ్మ తల్లి ఆలయ అనివేటి మండపానికి విరాళాలు



### కల్లూరి విజయ్ రూ 51,116/-లు,చీదెళ్ళ వెంకటేశ్వర్లు రూ 25,116/-లు విరాళాలు

**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు** ,గ్రామదేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ అనివేటి మండప నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భక్తులు తమకు తోచిన విధంగా విరాళాలను అందజేస్తున్నారు. కీర్తిశేషులు కల్లూరి వెంకటేశ్వర్లు ధర్మపత్ని లక్ష్మమ్మ కుమారుడు విజయ్ కుమార్ ధర్మపత్ని మమత రూ 51,116/-లు, చీదెళ్ళ వెంకటేశ్వర్లు ధర్మపత్ని కృష్ణకుమారి, చీదెళ్ళ సుబ్బయ్య ధర్మపత్ని ప్రభావతి రూ 25,116/-లు విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు మురలీమోహన్ కు అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణానికి సహకరించిన వారికి వారి కుటుంబ సభ్యులకి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆయన ఆకాంక్షించారు.

## శతజయంతి ఉత్సవాలు జరుపు కుంటున్న సి పి ఐ కార్యాలయం




**పామూరు, డిసెంబర్ 25, క్రైం కౌంటర్** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా పామూరు పట్టణంలోని సిపిఐ కమ్యూనిస్టు కార్యాలయం ఎరుపు రంగులతో, ఎరుపు కాంతులతో అతి సుందరంగా అలంకరించారు. ఈ అలంకరణ పామూరు మండల ప్రజలను ఎంతో ఆకర్షిస్తుంది.

## ఘనంగా కిస్మిస్ వేడుకలు



**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి**,మండల%శీ%లోని పలు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలలో పాస్టర్లు ఏసుక్రీస్తు గురించి ప్రవచనాలను తెలియజేశారు. చర్చిలను రంగులను వేసి విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. క్రైస్తవ సోదరులు విందుకు తమ ఇంటికి హిందువులను ఆహ్వానించారు.

## నేడు సిపిఐ శతాబ్ది ఉత్సవాలు




**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**సిపిఐ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా సిపిఐ కార్యాలయం వద్ద నుండి ర్యాలీ బయలుదేరి పామూరు రోడ్డు లో ఉన్న తిరుమల ఫంక్షన్ హాల్ లో శతాబ్ది ఉత్సవాల సమావేశం జరుగుతాయని కందుకూరు నియోజవర్గ కార్యదర్శి బి. సురేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ రావుల వెంకయ్య, ముఖ్యఅతిథిగా పాల్గొంటారనీ చెప్పారు.కందుకూరు నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న.. కరణం వెంకటేశ్వర్లు, మన్నం రమణయ్య



**పామూరు, డిసెంబర్ 25, క్రైం కౌంటర్** గుంటూరు లింగన్నపాలెం గ్రామంలోని కరణం వరమ్మ దశ దినకర్మ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం కంబాలదిన్నె గ్రామపంచాయతీకి చెందిన కరణం వెంకటేశ్వర్లు మోపాడు రిజర్వాయర్ చైర్మన్ సుంచుకొండయ్య కంబాలదిన్నె గ్రామ కమిటీ అధ్యక్షులు మన్నం రమణయ్య టిడిపి నాయకులు గోళ్ళ భాస్కరరావు మాజీ సర్పంచ్ గోళ్ళ కేశవరావు మాజీ సింగల్ విండో చైర్మన్ గద్దె గంగయ్యఏలూరి మహేశ్వరరావు పొన్నగంటి చిన్న రోశయ్య బెంగళూరు కేశవరావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించినారు

---



**క్రైమ్ కౌంటర్ న్యూస్..... ప్రకాశం జిల్లా...** ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖమరియు గ్రామ వార్డు సచివాలయాల మంత్రివర్యులు డోల బాల వీరాంజనేయ స్వామ మర్యాదపూర్వకంగా కలిసి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేయడం బాలల హక్కుల పరిరక్షణ కొరకు, హెచ్ఐవి ఎయిడ్స్ బాధితుల సేవలు కొరకు, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి సమూలనా నిర్మూలన లక్ష్యంతో అందరం పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు...

# చీరల పంపిణీ కార్యక్రమంలో డాక్టర్ ఆకుపాటి వెంకటేష్







**పామూరు, డిసెంబర్ 25, క్రైం కౌంటర్** పామూరు పట్టణంలో నీ నెల్లూరు రోడ్డు 565 హైవే దగ్గర గల ఉన్న ది పెంతెకోస్తు మిషన్ చర్చి నందు క్రిస్మస్ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎంపీటీసీ సంగం అధ్యక్షుడు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ క్రిస్టియన్ సోదరీమణులకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ ద్వారక , ఇండ్ల నరసింహరావు , సుంకె వెంకటేశ్వర్లు , తాళ్లపల్లి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# అనాధలకు దుప్పట్ల పంపిణీ చేసిన.కాలనీడి బాలు





**పామూరు, డిసెంబర్ 25, క్రైం కౌంటర్** మాలల సంక్షేమ సంఘం పామూరు శ్రీ కాలనీడి బాలు ఆధ్వర్యంలో పామూరు ఆర్టీసీ డిపో మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్రంథాలయము పరిసర ప్రాంతంలో గల అనాధలుకు చలి తీవ్రతతో బాధపడటం గమనించి దుప్పట్లును కాలనీడి బాలు తన ఆర్థిక సహకారంతో పంచడం జరిగినది. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జొన్నలగడ్డ గోవిందయ్య సంఘ బాధ్యులు రాజశేఖర్, పోతురాజు గాలింపు శ్రీను, కే రవీంద్రనాథ్ టీచర్, దమ్ము కార్తీక్( బ్యాంకర్) పాల్గొన్నారు.

# వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ సన్నద్ధం..

## లడ్డూ ప్రసాదం నాణ్యతపై చైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక దృష్టి



**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 25** తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వైకుంఠ ద్వార దర్శనాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (%ుణ%) పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ విశేష పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున, అందుకు తగ్గట్టుగా క్యూలైన్లు, మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన ఆయన, అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు.

ప్రధానంగా శ్రీవారి ప్రసాదమైన లడ్డూల తయారీ మరియు నాణ్యత విషయంలో రాజీ పడకూడదని చైర్మన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం తిరుమలలో రోజుకు సగటున 4 లక్షల సాధారణ లడ్డూలు, అలాగే 8 వేల కళ్యాణోత్సవ లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వైకుంఠ ద్వార దర్శన సమయంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరుగుతుంది కాబట్టి, ఆ సమయానికి అనుగుణంగా లడ్డూల ఉత్పత్తిని మరింత పెంచాలని నిర్ణయించారు. దీనికోసం అదనపు సిబ్బందిని మరియు ముడి సరుకులను ముందస్తుగానే సమకూర్చుకుంటున్నట్లు ఆయన వివరించారు.

లడ్డూల నాణ్యత, రుచిపై భక్తుల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంతో పోలిస్తే లడ్డూల రుచిని మెరుగుపరిచామని, నెయ్యి మరియు ఇతర దినుసుల విషయంలో కఠినమైన ప్రమాణాలు పాటిస్తున్నామని బీఆర్ నాయుడు పేర్కొన్నారు. లడ్డూ తయారీ కేంద్రమైన పోటును, విక్రయ శాలలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులకు తక్కువ సమయంలోనే ప్రసాదం అందేలా కౌంటర్ల సంఖ్యను పెంచడం ద్వారా క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించామని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.దర్శనం కోసం వేచి ఉండే భక్తులతో చైర్మన్ నేరుగా మాట్లాడి, అందుతున్న సేవలపై ఆరా తీశారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేయడమే తమ ప్రభుత్వ మరియు బోర్డు లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. వైకుంఠ ద్వారాల గుండా వెళ్లే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతో పాటు, అన్నప్రసాదం, తాగునీరు మరియు పారిశుధ్యం విషయంలో ఎక్కడా లోటు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పది రోజుల పాటు సాగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు భక్తులు కూడా సహకరించాలని ఆయన కోరారు.

# 'టీ' అంటే కేవలం అదే.. మిగిలినవన్నీ టీ కావు.

**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 25** ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజాగా 'టీ' విషయంలో కీలక ఆదేశాలు జారీ చేసింది. కేవలం కామెలియా సినెన్సిస్‌అనే మొక్క ఆకుల నుండి తయారైన పానీయాలను మాత్రమే 'టీ' అని పిలవాలని స్పష్టం చేసింది. సాధారణంగా మార్కెట్లో లభించే అనేక రకాల హెర్బల్ పానీయాలను టీ పేరుతో విక్రయించడం వల్ల వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారని అధికారులు గుర్తించారు. అందుకే ఇకపై అసలైన టీ ఆకులతో సంబంధం లేని డ్రింక్స్‌కు 'టీ' అనే పదాన్ని వాడటం నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు.

ప్రస్తుతం మార్కెట్లో గ్రీన్ టీ, బ్లాక్ టీ లతో పాటుగా ఎన్నో రకాల హెర్బల్ టీలు, ఫ్లేవర్ టీలు, ఇన్ఫ్యూజన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చామంతి , మందార లేదా రూయిబోస్ వంటి రకాలు అధికంగా ఉంటున్నాయి. అయితే ఇవి టీ ఆకులతో తయారైనవి కానప్పటికీ, వీటిని 'టీ' అని పిలవడం వల్ల వినియోగదారులు తప్పుడు సమాచారాన్ని పొందుతున్నారని అభిప్రాయపడింది. వాస్తవానికి ఇవి ఇతర మొక్కల పువ్వులు, ఆకులు లేదా వేర్లతో తయారయ్యే కషాయాలు మాత్రమేనని అధికారులు గుర్తు చేశారు.

కొత్త నిబంధనల ప్రకారం, టీ మొక్క ఆకులు లేని పానీయాలను విక్రయించేటప్పుడు వాటిని 'హెర్బల్ ఇన్ఫ్యూషన్' లేదా ఇతర ప్రత్యామ్నాయ పేర్లతో మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది. ప్యాకెట్ల మీద 'టీ' అని పెద్ద అక్షరాలతో ముద్రించి వినియోగదారులను ఆకర్షించే పద్ధతిని మానుకోవాలని తయారీదారులకు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తూ 'టీ' అనే ట్యాగ్‌ను తప్పుగా వాడితే



సదరు సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాల ఆహార భద్రతా అధికారులను ఆదేశించింది. నాణ్యత మరియు పారదర్శకతను పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

ప్రజలు తాము కొనే డ్రింక్స్ విషయంలో స్పష్టత కలిగి ఉండాలనేది ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అసలైన టీ ఆకులు ఉండే ఉత్పత్తులకు, సాధారణ మూలికా పానీయాలకు మధ్య వ్యత్యాసం తెలిసినప్పుడే వినియోగదారులు సరైన నిర్ణయం తీసుకోగలరని ప్రభుత్వం భావిస్తోంది. ఇకపై దుకాణాలలో లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో ఉత్పత్తులను కొనుగోలు చేసేటప్పుడు లేబుల్స్ నిశితంగా గమనించాలని సూచించింది. పారదర్శకమైన విక్రయాల ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడంతో పాటు ఆహార ప్రమాణాలను మరింత మెరుగుపరచడం ఈ కొత్త నిబంధనల లక్ష్యం.

# ఏడీబీ రోడ్డులో వెళ్లేదెలా!



**క్రైం కౌంటర్ న్యూస్ :** రాజానగరం, డిసెంబరు 25 : ఏడీబీ రోడ్డు.. నిత్యం రద్దీగా ఉండే రహదారి ఇది..గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు కష్టాలు చవిచూశారు.. అయితే కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే ఏడీబీ రోడ్డు సమస్యకు పరిష్కారం చూపిం ది.. సుమారు 35 కిలోమీటర్ల ఉండే రోడ్డులో దాదాపు 32 కిలోమీటర్ల వరకూ రోడ్డును పూర్తి చేశారు..వాహనాలు రయ్ రమ్‌మంటూ దూసు కెళ్తాయి..అయితే రంగంపేట ఊరి వద్దకు వచ్చేసరికి ఏ వాహనానికైనా బ్రేక్‌లు పడా ల్సిందే..మరో రెండు కిలో మీటర్లు వేగంగా ప్రయాణించి న తర్వాత రాజానగరం చేరుకునేసరికి మరోసారి బ్రేక్‌లు పడాల్సిందే.. కేవలం మూడు కిలోమీటర్ల మేర రహదారి మాత్రమే అసంపూర్తిగా నిలిచి పోయింది. దీంతో వాహనదారులు..అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. ప్రయాణికులు పాలిట శాపంగా పరిణమించాయి. ప్రధానంగా రాజానగరం హైస్కూల్ సమీపంలో రహదారి పూర్తిగా ఛిద్రమైంది.. చినుకు పడితే చెరువులా మారిపోతోంది. లేదంటే దుమ్ముతో రోడ్డు కనిపించకుండా పోతోంది. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఎగసిపడుతోంది. ఈ ప్రాంతంలోని దుకాణదారులు, నివాసిత ప్రజల ఇళ్లలోకి దుమ్ము చేరడంతో రాత్రి పగలు తేడా లేకుండా తలుపులు మూసుకుని కాలం వెళ్లదీస్తున్నా మంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. రాజానగరం హైస్కూల్ కూడలి లో ఫ్లయ్ ఓవర్ నిర్మించాలి ఉంది. పరిహారం వ్యత్యాసం విషయమై ఈ ప్రాంతంలోని కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో రహదారి అభివృద్ధి పనుల్లో జాప్యం తలెత్తింది. కేవలం కిలోమీటరు పరిధి కూడా ఉండని ప్రాంతంలోని ప్రజలు నిత్యం దుమ్ము, ధూళితో సహవాసం చేయడం పరిపాటిగా మారింది. దీనిపై సంబంధిత అ?ధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోతోందని ప్రజలు వాపోతున్నారు.చేసేదిలేక నివాసితులు మోటార్లు వినియోగించి నీటి తో ప్రతిరోజు దుమ్మిలేచిపోకుండా తడుపుకుంటున్నారు.ఇప్పటికైనా అధికా రులు దృష్టిసారించి ఏడీబీ రోడ్డు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు రావాల్సి ఉంది..

పరిహారం విషయమై కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలి చిపోయాయి.పరిహారాన్ని కోర్టులో చెల్లిం చాం.అదనపు నిధులు మంజూరుకు ఉ న్నతాధికారులకు నివేదించాం. త్వర లోనే ని?ధులు విడుదలకానున్నాయి. సం క్రాంతి అనంతరం ఫ్లయ్ ఓవర్, బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

# కొబ్బరిపై తెల్ల దోమ

**క్రైం కౌంటర్ న్యూస్ ,** ఏలూరు సిటీ, డిసెంబరు 25 ఏలూరు జిల్లాలో కొబ్బరి పంటపై రుగోస్ స్పైరలింగ్ వైట్‌ఫ్లై (తెల్లదోమ) పురుగు దాడి మొదలైంది. ప్రస్తుతం దీని ప్రభావం తక్కువ స్థాయిలో ఉన్నా రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ తెల్లదోమ పురుగు నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా ఉద్యానవన శాఖ ఉ న్నతాధికారులు చెబుతున్నారు. జిల్లాలో కొబ్బరి తోటల విస్తీర్ణం 13,650 హెక్టార్లు. ఏటా 2.22 కోట్ల22 కొబ్బరికాయలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాల ప్రభావంతో తెల్లదోమ దాడి తక్కువ స్థాయిలో ఉంది. వర్షాలతో పాటు వాతావరణంలో చల్లదనం వల్ల పురుగు ఉధృతి నియంత్రణలో ఉంది. రాబోయే మూడు నెలల్లో వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగితే వ్యాప్తి చెం దే అవకాశాలున్నాయని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నా రు. తెల్లదోమ వల్ల ఆకుల దిగువ భాగంలో తెల్లని మైనపు పదార్థం ఏర్పడడం, హనీడ్యూ స్రవించటం, తద్వారా ఆకులపై నల్లటి శిలీంద్రం (సూటీ మోల్డ్) ఏర్పడి కిరణజన్య సంక్రియ తగ్గే ప్రమాదం ఉ ంది. దీని ప్రభావంతో దిగుబడి తగ్గే అవకాశా లున్నాయి. కొబ్బరిసాగులో తెల్లదోమ దాడిని గుర్తించిన ఉద్యాన వన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎప్పటిక ప్పుడు రైతులకు ముందస్తు జాగ్రత్తలు, పురుగు నియంత్రణ చర్యలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రు. పురుగు సోకిన కొబ్బరి తోటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఉధృతిని సమర్ధవంతంగా తగ్గించవచ్చు.

తెల్లదోమ నివారణ చర్యలు ఇలా..

ఆకు దిగువ భాగంలో నీటితో పవర్ స్ప్రేయింగ్ ద్వారా బలంగా పిచికారీ చేసుకోవాలి.

ఎకరాకు పసుపురంగు జిగురు అట్టలను 15 నుంచి 20 వరకు ఏర్పాటు చేసుకోవటం వల్ల పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు.

వేపనూనె 5000 పీపీఎం 5 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి ఆకు అడుగు భాగాలు తడిసేలా పిచికారీ చేయాలి.

ఈసారియా ఫేమస్వరోజియా అనే జీవ శిలీంద్రాన్ని పిచికారీ చేసుకోవటం వల్ల పురుగు నివారించవచ్చు.

తెల్లదోమకు సహజ శత్రువులైన ఎంకార్స్య వంటి పరాన్నజీవులను లేడిబగ్ బీటెల్ వంటి శత్రువులను తోటలో వృద్ధి చెందేలా ప్రోత్సహించాలి.

తేమ వాతారణంలో పురుగు వ్యాప్తి తక్కుగా ఉంటుంది. రానున్న రోజుల్లో ఉధృతి పెరగక ముందే రైతులు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు

సమగ్ర యాజమాన్య పద్ధతులను రైతులకు చేరేలా క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఉద్యాన శాఖాధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ డిడి షాజానాయక్ తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు కొబ్బరి తోటలను గమనిస్తూ సూచనలను పాటిస్తూ పురుగు ఉ ధృతిని గమనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# సిరులొలికే! రైతు కళ్లల్లో సంక్రాంతి

**8.93 లక్షల టన్నులు సేకరణ**

**ఇప్పటి వరకూ 2,027 కోట్లు జమ**

**24 గంటల్లోనే చెల్లింపులు**

**1.54 లక్షల రైతులకు ఆనందం**

**గత వైసీపీలో సొమ్ములకు నరకం**



**క్రైం కౌంటర్ న్యూస్ :** ఈ ఏడాది అన్నదాతకు పండగే.. ఎందుకంటే పండుగకు ముందే ఖాతాల్లో డబ్బులు పడ్డాయి.. అన్నదాత కళ్లల్లో ఆనందాన్ని నింపాయి. 24 గంటల్లోగా ధాన్యం డబ్బులు.. ఒకనాడు కల.. కూటమి ప్రభుత్వం అది నిజం చేసి చూపింది.. రైతులను ఆనందంలో ముంచింది. గత ప్రభుత్వంలో 21 రోజులు గడువు విధించినా రైతులకు ఇక్కట్లే.. ఏనాడూ సక్రమంగా డబ్బులు జమచేసింది లేదు..అన్నదాతలు విసిగివేశారి దళారులకే విక్రయించుకునే వారు.. మరి నేడు.. 24 గంటల్లో ధాన్యం సొమ్ములు జమ చేస్తుండడంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్ర యించడానికి క్యూకడుతున్నారు. అత్యంత తక్కువ సమయంలో ధాన్యం డబ్బులు చేతికి రావడం చూసి ఎన్నేళ్లు అయిందోనని తల్చుకుని మురిసిపోతున్నారు... ఉమ్మడి జిల్లాలో అన్నదాతలకు ముందే సంక్రాంతి వచ్చింది. పం డగకు ముందే ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమవుతు న్నాయి. గతం లోలా డబ్బులకు ఎదురుచూపులు లేవు. ఖరీఫ్ ధాన్యం సేకరణను కూటమి ప్రభుత్వం అక్టోబరు మొదటి వారంలో ప్రారంభించింది. అన్నదాతలు పండించిన ధాన్యం లో కోతలు పెద్దగా లేకుండా అవసరాలు పోను మిగిలిన ధాన్యం అంతా సేకరించాలని నిర్ణయిం చింది. కాకినాడ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులు, తూర్పుగోదావరి జిల్లాలో 4 లక్షల టన్నులు, కోనసీమ జిల్లాలో 3.50 లక్షల టన్నులు సేకరించాలని లక్ష్యం విధించు కుంది.ఈ మేరకు ఎక్కడి కక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి గింజలు ఇచ్చిన 24 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 8.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యా న్ని ప్రభుత్వం కొనుగోలు చేయగా 1.54 లక్షల మంది అన్న దాతలకు రూ.2,027 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 90శాతానికిపైగా పూర్తి చేసింది.

కొనుగోళ్లు సాగాయిలా..

ప్రభుత్వం నిర్దేశించుకున్న 10.50 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి ఇప్పటి వరకు 8.93 లక్షల టన్నుల సేకరణ పూర్తయింది. కాకినాడ జిల్లాలో 2,42,633 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా 47,656 మంది రైతులకు రూ.540 కోట్ల జమచేసింది. ఇంకా రూ.4.70 కోట్లు ప్రాసెస్‌లో ఉన్నాయి. కోనసీమ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ ట న్నులు కొనుగోలు చేయగా 60,531 మంది రైతులకు రూ.707.50 కోట్లు జమచేశారు. రూ.7 కోట్లు చెల్లింపులకు సిద్ధంగా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 3.51 లక్షల మెట్రిక్ టన్నులు కొను గోలు చేయగా 45,750 మంది అన్నదాతలకు ఇప్పటి వరకు రూ.780 కోట్లు చెల్లింపులు జరిగాయి. ఒకరకంగా చెప్పాలంటే సంక్రాంతి పండగకు ముందే అన్నదాతలకు గింజల డబ్బులు జమవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడంతా నరకం..

గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు నరకంగా ఉం డేది. అప్పట్లో ఆర్బీకేల ద్వా రా ?ధాన్యం సేకరించిన ప్రభు త్వం 21 రోజులు దాటినా డబ్బులు చెల్లించేది కాదు. దీంతో సాగుకు చేసిన అప్పు లకు వడ్డీలు పెరిగి రైతులు ఇబ్బంది పడేవారు. కొందరు రైతులైతే అప్పులోళ్ల వేధిం పులు తాళలేక ఆత్మహత్య ప్రయత్నాలు చేశారు. జగన్ ప్రభుత్వంలో ధాన్యం డబ్బులు రాక తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడికి చెందిన చంద్రశేఖర్ (35) పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎందుకంటే ప్రతి ఖరీఫ్ సీజన్‌లో చెల్లింపులకు కనీసం మూడునెలలపైనే పట్టేది. దీంతో ఏటా బాకీలకు అన్నదాతలు కలెక్టరేట్లను ముట్టడించే పరిస్థితి వచ్చేది.ఉమ్మడి జిల్లా వ్యా ప్తంగా ఖరీఫ్‌లో ఇప్పటి లాగే 10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటే అందులో సగం కూడా కొనుగోలు చేసేదికాదు.దీంతో రైతులు ధాన్యంతో రోడ్డెక్కేవారు. మూడేళ్ల కిందట సంక్రాంతి పండగ సమయంలో ధాన్యంతో అమలాపురం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. అటు ధాన్యం డబ్బుల్లో జాప్యం చేయడానికి రైతులు ఇచ్చిన ధాన్యం వివరాలను ఆర్బీకేల్లో నమోదు చేయకుండా రోజుల తరబడి జాప్యం చేసేది. తద్వారా బాకీలు తక్కువగా చూపించేది.

## పులివెందులలో క్రిస్మస్ వేడుకలు.. పాల్గొన్న జగన్



**క్రైం కౌంటర్ న్యూస్ :** క్రిస్మస్ పండుగ సందర్భంగా పులివెందులలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్‌కు ఆయన తల్లి వైఎస్ విజయమ్మ ఆప్యాయంగా కేక్ తినిపిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది.

# గోవుల ఘోష ఆగదా? దశాబ్దాలుగా అక్రమ రవాణా

**కబేళాలకు తరలింపు**

**మూగ జీవులతో భారీ ఎత్తున వ్యాపారం**

**పట్టుబడుతున్నా రాని మార్పు**

**వాటిని చూసి ఆవేదన చెందుతున్న సగటు పౌరులు**



**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 25** గోవులు ఘోషిస్తున్నాయి. దశాబ్దాలుగా నరకం చూస్తున్నాయి. రవాణాలో కన్నీరు పెడుతున్నాయి. అయినా వాటికి రక్షణ ఉండడం లేదు. జిల్లాలో పశువుల అక్రమ రవాణా ఆగడం లేదు. దీనిపై చాలా ఏళ్ల నుంచి అన్ని వర్గాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇరుకుఇరుకుగా వాహనాల్లో కుక్కి తరలించడాన్ని చూసిన వారంతా అయ్యో అనుకుంటున్నారు. కానీ పరిస్థితిలో ఏమార్పు రావడం లేదు. మూగజీవాలను ఇష్టారాజ్యంగా వాహనాల్లో సంతలకు, కబేళాలకు తరలిస్తూనే ఉన్నారు.

పశువులను వాహనాల్లో అధికంగా కుక్కి రవాణా చేసే పద్ధతి దశాబ్దాలుగా మారడం లేదు. పశువుల కొనుగోలు, రవాణాకు సంబంధించి కనీస నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. ఇదో పెద్ద మాఫియా అని, దాని జోలికి ఎవరూ వెళ్లలేరన్న అపవాదును అధికారులు మూటగట్టుకుంటున్నారు. జంతుసంక్షేమం కోసం ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబరు 23 ఆచరణలో కనిపించడం లేదు. జిల్లాలో అన్ని ప్రాంతాల నుంచి ఆవులు కబేళాలకు తరలుతున్నాయి. పెదమానాపురం, అలమండ, అచ్యుతాపురం సంతలు ఇందుకు కేరాఫ్‌గా పేరొందాయి. ఈ మార్కెట్లలో భారీగా ఆవుల విక్రయాలు జరుగుతున్నాయి. అక్కడి నుంచి వ్యాపారులు ఆవులను కబేళాలకు తరలిస్తున్నారు. కొన్ని విజయనగరం తీసుకువెళ్తున్నట్లు సమాచారం. అక్కడి నుంచి మాంసం రూపంలో ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మార్కెట్లకు ఆవులను తరలించే క్రమంలో దారి మధ్యలో ఎక్కడైనా పోలీసులకు చిక్కినా నాయకులు, వ్యాపారుల నుంచి ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో కబేళా వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. గతంలో ఒట్టిపోయిన పశువులను, వ్యవసాయ పనులకు ఉపయోగపడని వాటినే కబేళాకు తరలించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. దూడలను సైతం అమ్మేస్తున్నారు. అందులోనూ మగ దూడ అయితే పుట్టిన కొద్దిరోజులకే కబేళాకు తరలిస్తున్నారు. శాండ్ మోనటరింగ్ కమిటీ అనుమతి లేకుండానే పెదమానాపురం సంత యాజమాన్యంతో కుమ్మక్కై అక్రమంగా పశు రవాణా లైసెన్స్ మంజూరు చేసిన దత్తిరాజేరు ఈఓపీఆర్డీ, పెదమానాపురం పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల ఆర్డీవో సమక్షంలో సమావేశమైన జంతు సంక్షేమ కమిటీ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరుకు సిఫారసు చేశారు. బొబ్బిలి నుంచి బొండపల్లి వరకు హైవే మీదుగా రాత్రీపగలు కంటైనర్లలో పశువుల అక్రమ రవాణా జరుగుతోందని, అధికార యంత్రాంగం గుర్తించి నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని కమిటీ కోరింది. అధికారులు ఆచరిస్తారో లేదో చూడాలి.

బొబ్బిలి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని సంతల్లో పశువుల వ్యాపారాలు నిర్వహిస్తున్న లైసెన్స్‌హోల్డర్‌ల పనితీరును స్వయంగా పరిశీలిస్తామని అధికారులు గతంలో చేసిన ప్రకటనలు అమలుకు నోచుకోవడం లేదు. దత్తిరాజేరు మండలం పెదమానాపురం, రాజాం, అలమండ తదితర సంతలన్నిటిపైనా గట్టి నిఘా పెడతామన్నారు. రాత్రివేళల్లో పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు హైవే పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేస్తామని పోలీసు అధికారులు ప్రకటించారు. ఆచరణలో కనిపించడం లేదు.

పశువుల రవాణాలో నిబంధనలు ఇలా..

సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. గడ్డి, దాణా, మంచినీరు, సీసీ కెమెరాలు, ర్యాంపులతో పాటు ఎకరానికి రెండు షెడ్డులు చొప్పున ఏర్పాటు చేయాలి. ఇన్‌గేటులో రిజిస్టర్ ఏర్పాటు చేసి పశువులను తెచ్చిన యజమాని వివరాలు నమోదు చేసి ఒక్కో జంతువుకు ఐదు రూపాయల చొప్పున వసూలు చేయాలి. జంతువులను కొనుగోలు చేసిన వ్యక్తి స్థానిక పశువైద్యుని నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ప్రత్యేక వాహనాల్లో ఎండ తగలకుండా వాటిని తరలించాలి. వెహికల్ ఇన్‌స్పెక్టరు ఈ తరహా రవాణా వాహనాలను ధ్రువీకరించాలి. వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలి.

అక్రమంగా రవాణా అవుతుండగా పట్టుబడ్డ ఆవులను తిరిగి వారికే అప్పగించకుండా గోశాలకు అప్పగించాలి. దేవాలయాలకు 300 మీటర్ల దూరంలో ఎటువంటి జంతు బలులు జరగకుండా బోర్డులను ఏర్పాటు చేయాలి. పవిత్రమైన దినాలలో మాంసం చేపలు దుకాణాలు తెరవకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

# 22-ఏ భూములకు విముక్తి! నేడు జడ్పీ హాల్‌లో 'మీ చేతికి.. మీ భూమి' మెగా డ్రైవ్



**హాజరుకానున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**సద్వినియోగం చేసుకోవాలని బాధితులకు పిలుపు**

**క్రైం కౌంటర్ న్యూస్ :** శ్రీకాకుళం/ కోటబొమ్మాళి, డిసెంబరు 25 అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో నిషిద్ధ జాబితా(22-ఏ)లో చిక్కుకున్న భూములకు విముక్తి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'మీ చేతికి.. మీ భూమి - 22ఏ భూ స్వేచ్ఛ' పేరుతో మెగా గ్రీవెన్స్(ప్రత్యేక డ్రైవ్) నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. అర్హత కలిగిన రైతులు.. భూ యజమానులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. 'వైసీపీ ప్రభుత్వం భూముల రీ-సర్వే పేరుతో రికార్డులను అస్తవ్యస్తం చేసింది. రైతుల భూములను లాక్కోవాలన్న దురుద్దేశంతో అర్హత ఉన్న భూములను కూడా అక్రమంగా 22-ఏ జాబితాలో చేర్చింది. ఆ అవ్యవస్థను సరిదిద్ది బాధితులకు న్యాయం చేస్తాం. ఈ విషయాన్ని ఇప్పటికే క్యాబినెట్ దృష్టికి తీసుకువెళ్లాం. రైతుల అభ్యంతరాలను స్వీకరించి రికార్డుల్లో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ ఉద్దేశమ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు.

అధికారులంతా ఒక్కచోటే...

అర్హత ఉన్నప్పటికీ గత పాలకుల తప్పిదాల వల్ల 22-ఏ, 22-1ఏ, 22-1బీ, 22-1సీ, 22-1డీ జాబితాల్లో పొరపాటను లేదా అక్రమంగా చేర్చబడిన భూముల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. తమ భూమి పత్రాలు, ఇతర ఆధారాలతో నేరుగా జడ్పీ హాల్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. ఈ మెగాడ్రైవ్‌లో జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర అన్నిస్థాయిల రెవెన్యూ అధికారులు పాల్గొంటారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇప్పటికే యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. రైతులు ఇచ్చే విజ్ఞాపనలను అధికారులు అక్కడికక్కడే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి భరోసా ఇచ్చారు.

# గిరిజనులు ప్రగతి పథంలో పయనించాలి

**క్రైం కౌంటర్ న్యూస్ :** గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 25 గిరిజనులు ప్రగతి పథంలో పయనించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గొరడ గ్రామంలో జట్టు స్వచ్ఛంద సేవాసంస్థ ఏర్పాటు చేసిన వావిలాల గోపాల కృష్ణయ్య స్మారక పురస్కార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాలొన్నారు. ఈ సందర్భంగా వావిలాల గోపాలకృష్ణయ్య గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. రూ.10 వేల విలువైన పుస్తకాలను అంద జేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను పార్వతీపురంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించానని, కష్టపడి చదివి ఈ స్థాయికి ఎదిగానన్నారు. గిరిజన యువత ఉన్నత చదువులు చదవాలని, ఈ గ్రంథా లయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జట్టు సేవా సంస్థ ద్వారా చేపడుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని గిరిజనులను చైతన్యపరిచే అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజనులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా జట్టు సేవా సంస్థ వావిలాల గోపాలకృష్ణయ్య స్మారక పురస్కారాన్ని న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ప్రదానం చేశారు. అనంతరం గిరి జన ప్రజలు, ప్రజా ప్రతిని?ధులు ఆయనకు పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రజలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, వీరికి వ్యవసాయంలో నూతన మెలకువలను తెలపాలన్నారు.



గిరిజన ప్రాంతానికి హైకోర్టు జస్టిస్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి ఎం.బబిత, ఎస్పీ మాధవరెడ్డి, అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు, జట్టు సేవా సంస్థ చైర్మన్ డి.పారినాయుడు, నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయమూర్తికి గిరిజనులు డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ గిరిజనులకు రగ్గులను పంపిణీ చేశారు.

# సినిమా



## అప్పుడు ఎత్తుకొని పెంచాం.. ఇప్పుడు పెద్ద హీరో అయ్యాడు..

ఆర్కే రోజా.. తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్ర వేసి, ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి సక్సెస్ అయ్యారు రోజా. సినిమాలు, రాజకీయాలతోనే కాదు బుల్లితెరపై కూడా సందడి చేసి ప్రేక్షకులను అలరించారు రోజా. ఇటీవలే సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు రోజా.. తమిళ్ లో ఓ సినిమాలో నటిస్తున్నారు. తాజాగా రోజా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ ఇంటర్వ్యూలో రోజా తన సినీ జీవితంలోని అనేక మధుర జ్ఞాపకాలను, ప్రముఖ నటులతో తన అనుభవాలను పంచుకున్నారు. తన కెరీర్ ప్రారంభం గురించి మాట్లాడుతూ.. భైరవ ద్వీపం సినిమాలో క్వీన్ గెటప్ కోసం తనకు స్క్రీన్ టెస్ట్ చేయకుండానే ఎంపిక చేశారని రోజా వెల్లడించారు. ఆ పాత్రలో తాను ఎంత బాగుంటావో అని దర్శకులు మెచ్చుకునేవారని తెలిపారు. అన్నమయ్య చిత్రంలో మోహన్ బాబు పక్కన క్వీన్ క్యారెక్టర్‌కు కూడా భైరవ ద్వీపం చూసి ఎంపిక చేశారని రోజా తెలిపారు.

టాప్ హీరోలతో తన అనుభవాలను వివరిస్తూ, వెంకటేష్ సెట్‌లో కొద్దిగా రిజర్వ్‌డ్‌గా ఉంటారని, అందరినీ పిలిచి మాట్లాడే స్వభావం ఆయనకు ఉండదని తెలిపారు. బాలకృష్ణ మాత్రం చాలా ఉల్లాసంగా ఉంటారని, అందరితో కూర్చొని కబుర్లు, పాటలు, పద్యాలు పాడుతూ సరదాగా గడుపుతారని అన్నారు రోజా.. నాగార్జున గురించి మాట్లాడుతూ, ఆయన అంటే అందరు హీరోయిన్లకు చాలా ఇష్టమని, ఆయన చాలా కూల్‌గా, డిగ్నిఫైడ్‌గా ఉంటారని, ఎవరినీ బాధపెట్టరని పేర్కొన్నారు. నార్మల్‌గా కొందరు హీరోలు హీరోయిన్లు తమ పక్కనే కూర్చొని మాట్లాడాలని లేదా తక్కువ డైలాగులు ఉండాలని భావిస్తారని, కానీ నాగార్జున అలా కాదని రోజా వివరించారు.

చిరంజీవితో తన మొదటి సినిమా ముఠామేస్త్రిలో మొదటి షాట్ డ్యాన్స్‌తోనే ప్రారంభమైందని రోజా గుర్తుచేసుకున్నారు. ఆ పాట ఇది ఎంత ఘాటు ప్రేమయో పారిజాతం అని తెలిపారు. స్లో సాంగ్ అయినప్పటికీ, చిరంజీవి తనతో చాలా సహనంగా వ్యవహరించారని, నేర్చుకోవడానికి సమయం ఇచ్చారని ఆమె తెలిపారు. కృష్ణ గారి గురించి మాట్లాడుతూ, ఆయన డ్యాన్స్‌లో ఎప్పుడూ కాన్ఫిడెంట్‌గా ఉంటారని, తమతో రిహార్సల్స్ చేయకుండానే, చూసి ఒకే టేక్‌లో చేసేవారని తెలిపారు రోజా. ప్రస్తుత జనరేషన్ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, మహేష్ బాబు వంటి వారితో అమ్మ, అత్త, వదిన వంటి పాత్రలు చేయాల్సి రావచ్చని సరదాగా అన్నారు. రాజకీయాల్లో చాలా మంది నటుల కంటే ఎక్కువ యాక్ట్ చేస్తారని ఆమె సరదాగా అన్నారు. రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ.. చిన్నప్పుడు తాము ఆయన్ను ఎత్తుకొని పెంచామని, ముఠామేస్త్రి షూటింగ్ సమయంలో ఊటీకి వచ్చాడని, అప్పుడు చాలా అల్లరివాడని గుర్తుచేసుకున్నారు. ఊటీ స్కూల్‌లో చేరిన తర్వాత సైలెంట్ అయ్యాడని తెలిపారు. ఆర్ఆర్ఆర్ చూసినప్పుడు గర్వంగా అనిపించిందని, మెగా అభిమానిగా, కుటుంబంలో ఒకరిగా ఆ సినిమాలోని మొదటి షాట్ తనకు బాగా నచ్చిందని చెప్పారు. చిన్నప్పుడు చిరంజీవి డాన్స్ వేస్తుంటే, రామ్ చరణ్ కూడా అదే పాటలకు డాన్స్ చేసేవాడని, తన డాడీ డాన్స్ అతనిలో కనిపిస్తుందని తెలిపారు. చెన్నైలో ఉన్నప్పుడు చిరంజీవి ఇంటికి తరచుగా వెళ్లేవారమని కూడా ఆమె గుర్తుచేసుకున్నారు.





## చలికాలంలో ఐస్ క్రీమ్ తింటే ఏమవుతుంది..

బయట చలి చంపేస్తున్నా.. ఐస్ క్రీం పార్లర్ల దగ్గర జనం తగ్గరు. కొందరికి ఐస్ క్రీం తినడానికి సీజన్‌తో సంబంధం ఉండదు. అయితే చలికాలంలో ఐస్ క్రీం తింటే జలుబు, దగ్గు వస్తుంది అని ఇంట్లో పెద్దలు హెచ్చరిస్తుంటారు. ఇంతకీ ఈ మాటలో నిజమెంత..? వింటర్‌లో చల్లని ఆహారాలు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమా..? దీనిపై వైద్య నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

ఐస్ క్రీం తింటే నిజంగా జలుబు వస్తుందా?

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఐస్ క్రీం తినడం వల్ల నేరుగా జలుబు రాదు. జలుబు, ఫ్లూ వంటివి వైరస్‌లు లేదా బ్యాక్టీరియా వల్ల వస్తాయి కానీ, చల్లని ఉష్ణోగ్రత వల్ల కాదు. చల్లని ఆహారం కడుపులోకి వెళ్లిన వెంటనే, మన శరీరంలోని అంతర్గత వ్యవస్థ దానిని వేడి చేయడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోదు. ఐస్ క్రీం ఒత్తిడిని తగ్గించి, మానసిక స్థితిని ఉల్లాసంగా ఉంచే ఆహారం. అందుకే చాలామంది చలిలో కూడా దీనిని ఇష్టపడతారు.

ఎవరు జాగ్రత్తగా ఉండాలి?

ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తింటే పెద్దగా ఇబ్బంది లేకపోయినా కొన్ని సమస్యలు ఉన్నవారు మాత్రం దూరంగా ఉండటం మంచిది.. గొంతు సమస్యలు: ఇప్పటికే గొంతు నొప్పి లేదా ఇన్‌ఫెక్షన్ ఉన్నవారికి చల్లని ఐస్ క్రీం ఆ అసౌకర్యాన్ని మరింత పెంచుతుంది.

అస్తమా, దగ్గు ఉన్నవారు: శ్వాసకోశ సమస్యలు లేదా తరచుగా దగ్గు వచ్చే వారికి చల్లని, చక్కెర కలిగిన ఆహారాలు కఫం ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది.

తేమ లేకపోవడం: చలికాలంలో గాలిలో తేమ తక్కువగా ఉంటుంది. ఐస్ క్రీం తినడం వల్ల గొంతు లోపలి భాగం మరింత పొడిబారి, వైరల్ ఇన్‌ఫెక్షన్లకు దారితీయవచ్చు.

ఐస్ క్రీం తినేటప్పుడు పాటించాల్సిన చిట్కాలు

వారానికి ఒకటి లేదా రెండు సార్లు మించకుండా చూసుకోండి.

ఐస్ క్రీంను గబగబా తినకుండా, చిన్న స్పూన్లతో నిదానంగా తినండి. దీనివల్ల నోటి ఉష్ణోగ్రత అకస్మాత్తుగా తగ్గదు.

ఐస్ క్రీం తిన్న తర్వాత గ్లాసు గోరువెచ్చని నీరు లేదా పాలు తాగడం వల్ల గొంతు సాధారణ స్థితికి వస్తుంది.

మీకు కొంచెం జలుబుగా అనిపించినా ఆ సమయంలో ఐస్ క్రీంకు దూరంగా ఉండటమే ఉత్తమం.

మొత్తానికి చలికాలంలో ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తినడం సురక్షితమే. అయితే అది మితంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లు.. పరిమితి దాటితే ఏదైనా ప్రమాదమే.



## శీతాకాలంలో లభించే చౌకైన పండు ఇదే..

పండ్లలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. వీటిని తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.. ముఖ్యంగా.. శీతాకాలంలో లభించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.. అలాంటి పండ్లలో జామకాయ ఒకటి.. శీతాకాలంలో జామ పండు తినడం మంచిది.. ఎందుకంటే ఇందులో ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఈ పండులో విటమిన్ సి, ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటాయి. జామ పండులో అరటిపండు కంటే ఎక్కువ పొటాషియం, 5 గ్రాముల ఫైబర్, 3 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. ఈ పండు సాధారణంగా ప్రతిచోటా లభిస్తుంది.. అన్ని సీజన్లలో జామపండ్లు లభిస్తున్నప్పటికీ.. శీతాకాలంలో ఎక్కువగా లభిస్తాయి.. అంతేకాకుండా చౌకగా కూడా ఉంటాయి.. సాధారణంగా ఒక జామకాయ రూ.5 లేదా 10 కి లభిస్తుంది.. ఇంకా కేజీ రూ.50 వరకు లభిస్తాయి.. అయితే.. నాణ్యతను బట్టి కూడా ధర ఉంటుంది. శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లో జామపండ్లు లభిస్తాయి..

ఒక్క పండు ఎన్నో లాభాలు..

జామ పండు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి.

జామ ఆకులు ఇన్సులిన్ నిరోధకతను మెరుగుపరుస్తాయి. జామ ఆకుల టీ తాగడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులలో భోజనం తర్వాత చక్కెర స్థాయిలు 10 శాతం తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఇంకా జామపండ్లు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. యాంటీఆక్సిడెంట్లు గుండెను ఫ్రీ రాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి.

జామపండ్లు కొలెస్ట్రాల్, రక్తపోటును కూడా తగ్గిస్తాయి. వీటిలోని ఫైబర్ కంటెంట్.. బరువును తగ్గేలా చేస్తుంది.

జామపండ్లు ముఖ్యంగా ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తాయి. ఈ పండులోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇంకా కడుపును ఆరోగ్యవంతంగా ఉంచుతుంది.

జామపండును ఎలాగైనా తినొచ్చు.. అల్పాహారంగా లేదా భోజనం తర్వాత జామపండును తినవచ్చు.. ఇంకా స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు.. ఇంకా జ్యూస్ చేసుకుని కూడా తాగొచ్చు..

## విరాట్ కోహ్లీ 2027 వరల్డ్ కప్ ఆడేనా..

టీమిండియా దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీ భవిష్యత్తు గురించి గత కొంతకాలంగా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే టీ20లు, టెస్ట్ క్రికెట్‌కు (మే 2025లో) రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, ఇప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో, 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కనిపిస్తాడా? లేదా? అనే ప్రశ్నకు ఆయన చిన్ననాటి కోచ్ రాజ్ కుమార్ శర్మ సమాధానమిచ్చారు.

విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీ విధ్వంసం..

దాదాపు 15 ఏళ్ల తర్వాత దేశవాళీ వన్డే టోర్నీ అయిన విజయ్ హజారే ట్రోఫీలోకి కోహ్లీ ఘనంగా పునరాగమనం చేశాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ 131 పరుగులతో అద్భుతమైన సెంచరీ బాదాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఆయన చూపిన ఫిట్‌నెస్, పరుగుల దాహం చూస్తుంటే వయస్సు కేవలం అంకె మాత్రమేనని మరోసారి నిరూపితమైంది.

కోచ్ రాజ్ కుమార్ శర్మ ఏమన్నారంటే?

కోహ్లీ తాజా ప్రదర్శనపై రాజ్ కుమార్ శర్మ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "విరాట్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత దేశవాళీ క్రికెట్ ఆడినా, తన క్లాస్‌ను ఏమాత్రం తగ్గించలేదు. అతను 2027 ప్రపంచకప్ ఆడేందుకు 100 శాతం సిద్ధంగా ఉన్నాడు. భారత వన్డే జట్టులో అతనే అత్యంత నిలకడైన ఆటగాడు" అని ఆయన పేర్కొన్నారు.

విరాట్ ఫిట్‌నెస్ పరంగా ప్రపంచంలోనే మేటి అని, అతనిలో ఇంకా పరుగుల ఆకలి తీరలేదని కోచ్ గుర్తు చేశారు. 2027 వరల్డ్ కప్ నాటికి విరాట్ వయస్సు 38 ఏళ్లు దాటినప్పటికీ, అతని బాడీ ఇంకా యువకుడిలాగే సహకరిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వన్డేలపైనే పూర్తి ఫోకస్..

రోహిత్ శర్మతో కలిసి విరాట్ ఇప్పటికే ఇతర ఫార్మాట్ల నుంచి తప్పుకోవడంతో, వారిద్దరి ఏకైక లక్ష్యం 2027 వన్డే ప్రపంచకప్ అని స్పష్టమవుతోంది. భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా ఇటీవల మాట్లాడుతూ.. రోహిత్, కోహ్లీలు ఫిట్‌గా ఉన్నంత కాలం జట్టుకు వారి అనుభవం ఎంతో అవసరమని, వారు ప్రపంచకప్‌లో ఆడాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు.

సచిన్ టెండూల్కర్ తన 38వ ఏట 2011 ప్రపంచకప్ గెలిచినట్లుగా, విరాట్ కోహ్లీ కూడా 2027లో భారత్‌కు కప్పు అందించి తన కెరీర్‌ను ఘనంగా ముగించాలని అభిమానులు కోరుకుంటున్నారు. కోచ్ రాజ్ కుమార్ శర్మ ఇచ్చిన ఈ అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ కోహ్లీ ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని నింపుతోంది.




## 'గంభీర్ ఇది చూస్తున్నావా?'..

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ తన బ్యాట్‌తో మరోసారి అలజడి సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో భాగంగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో ముంబై తరపున బరిలోకి దిగిన రోహిత్, విధ్వంసకర సెంచరీతో స్టేడియాన్ని హోరెత్తించాడు.

సిక్కిం నిర్దేశించిన 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ శర్మ క్లాస్, మాస్ ఇన్నింగ్స్‌ను ప్రదర్శించాడు. కేవలం 94 బంతుల్లోనే 155 పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. రోహిత్ ఇన్నింగ్స్‌లో 18 ఫోర్లు, 9 కళ్ళు చెదిరే సిక్సర్లు ఉన్నాయి. అతని బ్యాటింగ్ ధాటికి ముంబై జట్టు కేవలం 30.3 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది.

గంభీర్‌ను టార్గెట్ చేసిన అభిమానులు..

ఈ మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గ్యాలరీలో బీసీసీఐ సెలెక్టర్ ఆర్పీ సింగ్‌ను చూసిన అభిమానులు, వెంటనే టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ఉద్దేశించి నినాదాలు చేయడం ప్రారంభించారు. "గంభీర్ ఎక్కడున్నావ్? చూస్తున్నావా రోహిత్ ఆటను?" అంటూ ఫ్యాన్స్ గట్టిగా అరిచారు.

ఇటీవల గంభీర్ జట్టులో "స్టార్ కల్చర్"ను అంతం చేయాలని భావిస్తున్నట్లు వార్తలు రావడం, రోహిత్ భవిష్యత్తుపై అంచనాలు నెలకొన్న నేపథ్యంలో అభిమానులు ఈ విధంగా స్పందించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రోహిత్ శర్మ ఇంకా అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడని, అతడిని తక్కువ అంచనా వేయవద్దని గంభీర్‌కు అభిమానులు పరోక్షంగా హెచ్చరికలు పంపారు.

ఒక దేశవాళీ మ్యాచ్ కోసం సుమారు 20,000 మందికి పైగా అభిమానులు స్టేడియానికి రావడం విశేషం. కేవలం రోహిత్ బ్యాటింగ్‌ను చూడటం కోసమే జనం పనులను మానుకొని, కాలేజీలను ఎగ్గొట్టి మరీ వచ్చారు. స్టేడియం అంతా "ముంబై చా రాజా రోహిత్ శర్మ" అనే నినాదాలతో మారుమోగిపోయింది.

సిక్కిం బ్యాటర్ ఆశిష్ థాపా (79) పోరాడినప్పటికీ, రోహిత్ విధ్వంసం ముందు వారి బౌలింగ్ తేలిపోయింది. ఈ ఇన్నింగ్స్ ద్వారా రోహిత్ శర్మ తన సత్తా ఇంకా తగ్గలేదని సెలెక్టర్లకు, కోచ్‌కు బలమైన సంకేతం పంపాడు.

విజయ్ హజారే ట్రోఫీలో రోహిత్ చేసిన ఈ సెంచరీ కేవలం ఒక ఇన్నింగ్స్ మాత్రమే కాదు, తన విమర్శకులకు సమాధానం కూడా. గంభీర్ వ్యూహాలు ఎలా ఉన్నా, హిట్‌మ్యాన్ ఫామ్‌లో ఉంటే ఆపడం ఎవరికీ సాధ్యం కాదని ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com